జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 29 | జూన్ | 2026 ◆ పేజీలు : 7



# ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి



- పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం కలెక్టరేట్, / పాల్వంచ, జూన్ 28,(ప్రజాజ్యోతి) ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం

మిగతా 2 లో...



# డ్రైనేజీలు శుభ్రం చేసేది ఎప్పుడు...?

3 లో..

- చెత్తతో కూరుకుపోయిన డ్రైనేజీలు
- బడి పక్కనే మురుగు నిల్వలు
- పంచాయితీ అధికారుల చర్యలు ఎప్పుడు ?
- డ్రైనేజీల శుభ్రత కోసం ఎదురుచూపులు..

● చర్ల, ప్రజాజ్యోతి

పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. గ్రామంలోని ప్రధాన రహదారులు, కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, విద్యాసంస్థల సమీపంలోని డ్రైనేజీలు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టి, కలుపు మొక్కలతో నిండిపోయి మురుగునీటి ప్రవాహం నిలిచిపోవటంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాలం డ్రైనేజీలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయడంలో పంచాయతీ అధికారులు పట్టించుకోవాలని అంటున్నారు.

# రైతు సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు



- జూన్ 30న చింతకానిలో రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద 'రైతు ఆశీర్వాద సభ'
- అన్నదాతల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట, జూన్ 28 (ప్రజాజ్యోతి): వ్యవసాయాన్ని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావిస్తూ, రైతు సంక్షేమాన్ని ప్రభుత్వ పాలనలో అత్యున్నత ప్రాధాన్యతగా నిలిపిన తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుడుతోంది. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ, రైతు కుటుంబాల ఆర్థిక పురోగతి లక్ష్యంగా ఈ నెల 30వ తేదీన ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం వద్ద నిర్వహించనున్న "రైతు ఆశీర్వాద సభ" రాష్ట్ర చరిత్రలోనే ఒక మహత్తర కార్యక్రమంగా నిలవనుంది అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ

మిగతా 2 లో...

# పల్స్ పోలియో కార్యక్రమానికి ఘన ప్రారంభం

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

2 లో...





# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో... మరో కుదింపు..!

2 లో..

- ఇష్టానుసారంగా స్లాబ్ వేసుకునే వెసులుబాటుకు ముగింపు
- పాత నిబంధనలతో పోలిస్తే మరింత కఠినతరం
- అదనపు అప్పులు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం..!

● కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి నిబంధనలను కఠినతరం చేసింది. ఇంటి ప్లింత్ ఏరియాను మార్చకపోయినా, స్లాబ్ నిర్మాణంపై స్పష్టమైన పరిమితులు విధిస్తూ ఈ నెల 27 న జీఓ నం.352 జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు లబ్ధిదారులకు ఉన్న వెసులుబాటుకు గణనీయంగా కోత పడింది. గతంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్లింత్ ఏరియాలో ఇంటిని నిర్మించి, తమ సొంత ఖర్చుతో అవసరాన్ని బట్టి ముందు, పక్క వైపులా స్లాబ్‌ను ఎంత వరకు విస్తరించుకోవాలన్నది లబ్ధిదారుల నిర్ణయానికే వదిలేసేది. దీంతో చాలామంది మూడు అడుగులు, ఐదు అడుగులు, ఎనిమిది అడుగుల వరకు స్లాబ్‌ను విస్తరించి పెద్ద పోర్టికోలు నిర్మించుకున్నారు. కానీ ఈ నిర్ణయం వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగి, చాలామంది అప్పుల పాలవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది.

## పల్స్ పోలియో కార్యక్రమానికి ఘన ప్రారంభం

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య





**టేకులపల్లి, జూన్ 28,ప్రజాజ్యోతి:** దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని టేకులపల్లి మండలంలో ఘనంగా ప్రారంభించారు.ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులోని అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌ను స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ పోలియో పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని అన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్న తీరును ఆయన అభినందించారు. అదేవిధంగా మండలంలోని మొక్కంపాడు గ్రామపంచాయతీ లో కూడా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బానోత్ సురేష్, ఉపాధ్యాయుడు రవి కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఉదయం నుంచే చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఐదేళ్లలోపు ఒక్క చిన్నారిని కూడా మినహాయించకుండా పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర ఆరోగ్య కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.ముత్యాలంపాడు కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్, సర్పంచ్ పూల్ బంతి, ఉప సర్పంచ్ చేతుల నాగేశ్వరరావు, కోరం సురేందర్, కోయగూడెం సర్పంచ్ కోరం బోసు, రాందాస్ నాయక్, కాలే ప్రసాద్, శివలాల్, లింబియా రవి, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణ అధికారి పున్నమయ్య, సూపర్వైజర్ కౌసల్య, ఫార్మసీ ఆఫీసర్ కిరణ్ కుమారి, నర్సింగ్ ఆఫీసర్ సుస్మిత, అంగన్వాడీ సూపర్వైజర్లు నిర్మల, లక్ష్మి, పద్మ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్త సత్యవతి, ఆశా కార్యకర్తలు బానోత్ మంగమ్మ,భాయమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగగా, గ్రామానికి చెందిన మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భర్త అదృశ్యం.. మిస్సింగ్ కేసు నమోదు

- దర్యాప్తు చేపట్టిన టేకులపల్లి పోలీసులు

**టేకులపల్లి, జూన్ 28, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు టేకులపల్లి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం.. బేతంపూడి గ్రామానికి చెందిన బానోత్ కిషన్ (50) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో కూడా అప్పుడప్పుడు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి కొద్ది రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ నెల జూన్ 11న కిషన్ భార్య బానోత్ కమలిబాయి పనిమీద టేకులపల్లికి వెళ్లగా,అప్పటికి కిషన్ ఇంట్లోనే ఉన్నాడు. మధ్యాహ్నం సుమారు 3 గంటలకు ఆమె తిరిగి ఇంటికి చేరుకోగా భర్త కనిపించలేదు.దీంతో బంధువులు, రక్తసంబంధీకులు, స్నేహితులు, తెలిసిన ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు.చివరకు బానోత్ కమలిబాయి టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అదృశ్యమైన బానోత్ కిషన్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే కిషన్ గురించి సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా టేకులపల్లి పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో... మరో కుదింపు..!

- కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

- ఇష్టానుసారంగా స్లాబ్ వేసుకునే వెసులుబాటుకు ముగింపు
- పాత నిబంధనలతో పోలిస్తే మరింత కఠినతరం
- అదనపు అప్పులు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం..!

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి నిబంధనలను కఠినతరం చేసింది. ఇంటి ప్లింత్ ఏరియాను మార్చకపోయినా, స్లాబ్ నిర్మాణంపై స్పష్టమైన పరిమితులు విధిస్తూ ఈ నెల 27 న జీఓ నం.352 జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు లబ్ధిదారులకు ఉన్న వెసులుబాటుకు గణనీయంగా కోత పడింది. గతంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్లింత్ ఏరియాలో ఇంటిని నిర్మించి, తమ సొంత ఖర్చుతో అవసరాన్ని బట్టి ముందు, పక్క వైపులా స్లాబ్‌ను ఎంత వరకు విస్తరించుకోవాలన్నది లబ్ధిదారుల నిర్ణయానికే వదిలేసేది. దీంతో చాలామంది మూడు అడుగులు, ఐదు అడుగులు, ఎనిమిది అడుగుల వరకు స్లాబ్‌ను విస్తరించి పెద్ద పోర్టికోలు నిర్మించుకున్నారు. కానీ ఈ నిర్ణయం వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగి, చాలామంది అప్పల పాలవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది.**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి నిబంధనలను కఠినతరం చేసింది. ఇంటి ప్లింత్ ఏరియాను మార్చకపోయినా, స్లాబ్ నిర్మాణంపై స్పష్టమైన పరిమితులు విధిస్తూ ఈ నెల 27 న జీఓ నం.352 జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు లబ్ధిదారులకు ఉన్న వెసులుబాటుకు గణనీయంగా కోత పడింది. గతంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్లింత్ ఏరియాలో ఇంటిని నిర్మించి, తమ సొంత ఖర్చుతో అవసరాన్ని బట్టి ముందు, పక్క వైపులా స్లాబ్‌ను ఎంత వరకు విస్తరించుకోవాలన్నది లబ్ధిదారుల నిర్ణయానికే వదిలేసేది. దీంతో చాలామంది మూడు అడుగులు, ఐదు అడుగులు, ఎనిమిది అడుగుల వరకు స్లాబ్‌ను విస్తరించి పెద్ద పోర్టికోలు నిర్మించుకున్నారు. కానీ ఈ నిర్ణయం వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగి, చాలామంది అప్పుల పాలవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రభుత్వం తొలి దశలో ఇంటి నిర్మాణానికి పరిమితులు తీసుకొచ్చింది.ప్లింత్ ఏరియా, స్లాబ్ విస్తీర్ణంపై నియంత్రణలు విధిస్తూ నిర్మాణాలను ఒకే నమూనాలో చేపట్టాలని సూచించింది. అందులో గరిష్టంగా స్లాబ్ ఏరియా 990 చదరపు అడుగుల నిర్ణయించింది. ఇప్పుడు తాజాగా జారీ చేసిన జీఓతో ఆ నిబంధనలను మరింత స్పష్టంగా, మరింత కఠినంగా అమలు చేయాలని నిర్ణయించింది. కొత్త నిబంధనల ప్రకారం ఇంటి ముందు భాగంలో మాత్రమే గరిష్ఠంగా మూడు అడుగుల వరకు స్లాబ్ పొడిగించేందుకు అనుమతి ఉంటుంది. మిగిలిన మూడు వైపులా ఒక్క అడుగు మాత్రమే పొడిగించాలి. అలాగే 600 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా ఉన్న ఇంటికి గరిష్ఠంగా 750 చదరపు అడుగుల స్లాబ్, 400 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా ఉన్న ఇంటికి గరిష్ఠంగా 500 చదరపు అడుగుల స్లాబ్ మాత్రమే అనుమతిస్తారు. అంతకు మించి నిర్మాణం చేయడానికి అవకాశం ఉండదు. ఇంటి చుట్టూ పూర్తిస్థాయిలో ఆర్‌సీసీ స్లాబ్ వేయకుండా, అవసరమైన చోట చజ్జాలు (సన్‌షేడ్స్) ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ముందు భాగంలో ఎక్కువ నీడ అవసరమైతే జీఐ షీట్ షెడ్ ఏర్పాటు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ నిబంధనలు ప్రస్తుతం బేస్‌మెంట్, గ్రౌండింగ్, రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్లతో పాటు ఇంకా నిర్మాణం ప్రారంభించని అన్ని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వర్తిస్తాయి. జిల్లా కలెక్టర్లు, పీడీలు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి కొత్త నిబంధనలు అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం చెబుతున్నదాని ప్రకారం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశం లబ్ధిదారులు అదనపు అప్పుల భారం పడకుండా చూడడమే అని తెలుస్తోంది. అయితే మరోవైపు, తమ అవసరాలకు అనుగుణంగా కొంత పెద్దగా ఇల్లు నిర్మించుకోవాలనుకునే లబ్ధిదారులకు మాత్రం ఈ నిబంధనలు పరిమితిగా మారనున్నాయి. గతంలో ఉన్న వెసులుబాటుతో పోలిస్తే ఇప్పుడు స్లాబ్ నిర్మాణంపై మరింత నియంత్రణ విధించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఈ కొత్త నిబంధనలు జిల్లలో క్షేత్ర స్థాయిలో ఎలా అమలవుతాయన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## రైతు సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు

(మొదటి పేజీ తరువాయి...)



రైతులే దేశానికి వెన్నెముక అని, రైతు సంతోషమే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని అన్నారు. రైతు కష్టాన్ని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి సంక్షేమం కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రైతు ఆశీర్వాద సభ కేవలం ఒక రాజకీయ లేదా ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ఇది రైతుల సమస్యలను నేరుగా తెలుసుకునే, వారి అభిప్రాయాలను వినే, ఆధునిక వ్యవసాయ సాంకేతికతను పరిచయం చేసే, వ్యవసాయ రంగ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే మహోన్నత వేదికగా నిలవబోతోందని మంత్రి వివరించారు.ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ పంటల దిగుబడులు పెంచడం, సాగు వ్యయాన్ని తగ్గించడం, మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరచడం, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సలహాలు అందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.జగన్నాథపురంలో నిర్వహించే ఈ రైతు ఆశీర్వాద సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ విధానాలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ చారిత్రాత్మక సభను విజయవంతం చేయడానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ కూలీలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.అన్నదాత ఆశీర్వాదమే రాష్ట్ర అభివృద్ధికి అసలైన బలం అని, రైతు సంక్షేమమే ప్రభుత్వ పాలనకు నిజమైన విజయమని, రైతు చిరునవ్వే తెలంగాణ ప్రగతికి ప్రతీక అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి



(మొదటి పేజీ తరువాయి...)

సందర్భంగా పాల్వంచ మండలం ఇందిరా నగర్ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులకు ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లే ఆరోగ్య సిబ్బంది ద్వారా పోలియో చుక్కలు వేయిస్తామని తెలిపారు. ప్రయాణాల్లో ఉన్న కుటుంబాలు బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇటుక బట్టీలు, వ్యవసాయ పనులు, నిర్మాణ ప్రదేశాలు, ఇతర పని ప్రదేశాల్లో ఉన్న చిన్నారులకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# డ్రైనేజీలు శుభ్రం చేసేది ఎప్పుడు...?

- చెతతో కూరుకుపోయిన డ్రైనేజీలు
- బడి పక్కనే మురుగు నిల్వలు
- పంచాయితీ అధికారుల చర్యలు ఎప్పుడు ?
- డ్రైనేజీల శుభ్రత కోసం ఎదురుచూపులు..

● చర్ల, ప్రజాజ్యోతి

**పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. గ్రామంలోని ప్రధాన రహదారులు, కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, విద్యాసంస్థల సమీపంలోని డ్రైనేజీలు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టి, కలుపు మొక్కలతో నిండిపోయి మురుగునీటి ప్రవాహం నిలిచిపోవటంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాలం డ్రైనేజీలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయడంలో పంచాయతీ అధికారులు పట్టించుకోవాలని అంటున్నారు.**

ఇప్పటికే జూన్ నెల ముగింపు దశకు చేరుకున్నప్పటికీ వర్షాకాలానికి ముందే చేపట్టాల్సిన ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు ఎక్కడా కనిపించకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.నామమాత్రంగా కొంతమేర శుభ్రపరిచినా చాలా కాలనీల్లో పరిస్థితి యథాతథంగానే ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు మరింత ఉధృతమైతే డ్రైనేజీల్లో నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయి మురుగునీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించే ప్రమాదం ఉందని చెబుతున్నారు.డ్రైనేజీల్లో రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య లోపం ప్రజారోగ్యానికి పెను ముప్పుగా మారిందని అభిప్రాయపడుతున్నారు.చర్ల పంచాయతీ కార్యాలయానికి సమీపంలోని మసీదు సెంటర్ పల్లె ప్రకృతి వనంకు ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల పక్కనే డ్రైనేజీ పూర్తిగా చెత్తాచెదారంతో మూసుకుపోయి మురుగునీరు నిల్వ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ప్రతిరోజూ విద్యార్థులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. దుర్వాసన, దోమల బెడద, అపరిశుభ్ర వాతావరణం కారణంగా చిన్నారులు అనారోగ్యానికి గురయ్యే



ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ముత్యాలమ్మ ఆలయ రహదారిలోని డ్రైనేజీలు కూడా పూర్తిగా మురుగునీటితో నిండిపోయి దోమల పెంపక కేంద్రాలుగా మారాయి. ఇదే పరిస్థితి పలు కాలనీల్లో నెలకొనడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రి వేళల్లో దోమల బెడద అధికంగా ఉండటంతో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో ప్రతి ఏడాది వర్షాకాలానికి ముందే డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడం, కాలువలను పూర్తిగా శుభ్రం చేయడం, కలుపు మొక్కలను తొలగించడం, కలుపు మందు పిచికారీ చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ నిర్వహించడం వంటి చర్యలను పంచాయతీ అధికారులు చేపట్టేవారని ప్రజలు గుర్తు చేస్తున్నారు. అయితే ఈసారి అలాంటి చర్యలు ఎక్కడా కనిపించకపోవడంతో కాలువల వెంట పిచ్చి మొక్కలు విస్తరించి నీటి ప్రవాహానికి పూర్తిగా అడ్డంకిగా మారాయని వారు వాపోతున్నారు. ప్రస్తుతం అనేక కాలనీల్లో డ్రైనేజీలు పూర్తిగా మూసుకుపోవడంతో మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. దీనివల్ల దుర్వాసన వెదజల్లడంతో పాటు ఈగలు, దోమలు అధికంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారాయి. ఒక వైపు ప్రభుత్వ వైద్యాధికారులు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల నివారణ చర్యలు



తప్పనిసరిగా చేపట్టాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, కూలర్లు, ట్యాంకులు, టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే ప్రజలకు సూచనలు చేసే ప్రభుత్వ యంత్రాంగమే గ్రామంలోని డ్రైనేజీల నిర్వహణలో నిర్లక్ష్యం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన పంచాయతీ అధికారులు సమస్య తీవ్రతను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో అంటువ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని మండల ప్రజలు అంటున్నారు. వర్షాకాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా వైరల్ జ్వరాల బారిన పడే అవకాశం ఉండటంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే అవకాశముందని చెబుతున్నారు.ఇప్పటికైనా చర్ల మేజర్ పంచాయతీ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి మండలంలోని అన్ని కాలనీల్లో డ్రైనేజీలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని, చెత్తాచెదారాన్ని తొలగించాలని, కలుపు మొక్కలను నిర్మూలించాలని, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, యాంటీ లార్వా మందుల పిచికారీ, నిల్వ నీటి తొల గింపు వంటి చర్యలను అత్యవసరంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే వర్షాకాలం మొత్తం పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజారోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## బూత్ ఓటర్లకు ఎన్యుమరేషన్ అవగాహన సదస్సు



**అశ్వాపురం, జూన్ 28,ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని గౌతమీనగర్(హెవీ వాటర్ ప్లాంట్ రెసిడెన్స్ కాలనీ) లోని 5 బూత్ లలో ఓటర్ ఎన్యూమరేషన్ ఫామ్ ల డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి మాట్లాడుతూ సర్ ప్రక్రియ అంటే కేవలం ఓటర్ల జాబితా ప్రక్రియ అని, అర్హులైన ఓటర్లు తప్పులను సరిదిద్దడానికి దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు.ఐదు బూత్ లలో భారీ స్థాయిలో ఓట్లు తొలగించే అవకాశం ఎక్కువగా ఉన్నందున బి ఎల్ ఓ లు గానీ బి ఎల్ ఏ లు గానీ అప్రమత్తతగా ఉండాలని కోరుకుంటూ.. బి ఎల్ వో లు, సూపర్వైజర్లు అందించే ఎన్యూమరేషన్ పారాలను కుటుంబ సభ్యుల్లో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరు పారాలో వివరాలను నమోదు చేసి బిఎల్ఓ లకు అందించి సమయంలో రసీదును తీసుకోవాలన్నారు. ఎలా నింపాలనే దానిపై ఓటర్లకు అవగాహన కల్పించడం జరిగింది. సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, మోర్వినేని చంద్రకళ అధికారులు అశ్వాపురం జి పి సెక్రటరీ యాకుబ్, జి పి ఓ లక్ష్మణ్, ఇతర బి ల్ ఓ లు పాల్గొన్నారు.

## మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు



**ఇల్లందు, జూన్ 28 (ప్రజా జ్యోతి)**ఈ నెల 30న మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం జగన్నాధపురంలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన కార్యక్రమానికి సంబంధించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని ఎమ్మెల్యే తో కలిసి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రజలను పెద్ద ఎత్తున తరలించి జయప్రదం చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ వైస్ యంపిపి మండల రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, కౌన్సిలర్ మెరుగు కార్తీక్ యాదవ్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ నాయకుడు కోరం సురేందర్, నాయకులు గణేష్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు

● కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి మనోహర్ రావు



**పాల్వంచ, జూన్ 28, ప్రజా జ్యోతి:**పాల్వంచ పట్టణంలోని 36వ డివిజన్ గట్టాయిగూడెం పరిధిలోనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని డివిజన్ కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి మనోహర్ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రి సద్వినియోగం చేసుకొని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గీత, ఆశా వర్కర్ శశికళ, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పాత్రికేయుడికి ఘన సన్మానం



ఇల్లందు, జూన్ 28 (ప్రజా జ్యోతి) ఇటీవల జరిగిన ఇల్లందు మున్సిపల్ ఎన్నికల్లో 22వ వార్డు కౌన్సిలర్ గా విజయం సాధించిన కొర్లపాటి శివ కిరణ్ ను ఆదివారం సుభాష్ నగర్ లోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో జరిగిన టీయూడబ్ల్యూజే – ఐజేయు ఇల్లందు డివిజన్ మహాసభలో జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం శాలువతో ఘనంగా సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిలో కొనసాగుతూ ప్రజా సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉండి మున్సిపల్ ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్ గా స్వతంత్ర అభ్యర్థిగా కొర్లపాటి శివకిరణ్ గెలవడం సంతోషకరమన్నారు. నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం ఒక ప్రజాప్రతినిధులుగా నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అదేవిధంగా సమస్యలు పరిష్కారం కాని పక్షంలో దానిని పత్రిక రూపంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు జి రమేష్, నాగచందు, కె వెంకటేశ్వర్లు, గద్దం వెంకటేశ్వర్లు, సుమంత్, పాషా, నూతన డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదాసు నర్సి, శ్రావణ్ రెడ్డి, కోశాధికారి బొంగాని నరేష్, ధారావత్ వీరన్న, మహేందర్ రెడ్డి, ప్రశాంత్, కొత్త వెంకటేశ్వర్లు, సలీం, ఈనాడు రాజు, దేవి రెడ్డి, చారి, విజ్ఞాన్, పగడాల చందు, తోటకూరి జయంత్, సద్గుణ చారి, తిరుపతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# టియుడబ్ల్యూజె - ఐజేయు ఇల్లందు డివిజన్ కమిటీ ఎన్నిక





ఇల్లందు, జూన్ 28 (ప్రజా జ్యోతి) టియుడబ్ల్యూజె – ఐజేయు ఇల్లందు డివిజన్ కమిటీ నూతన కమిటీని ఆదివారం సుభాష్ నగర్ లోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదాసు నర్సి (మహా న్యూస్), ప్రధాన కార్యదర్శిగా సూరం శ్రావణ్ రెడ్డి (సాక్షి), కోశాధికారిగా బొంగాని నరేష్ కుమార్ (వెలుగు), ఉపాధ్యక్షులుగా ధారావత్ వీరన్న (వార్త), అన్నారపు వెంకటేశ్వర్లు (విజయక్రాంతి), రామకృష్ణ (వార్త), సహాయ కార్యదర్శులుగా రాయల ప్రశాంత్ (దిశ), పరమ ప్రభాకర్ (ఆంధ్రప్రభ), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి. శ్రావణ్ (ఆంధ్రజ్యోతి), కార్యవర్గ సభ్యులుగా మహేందర్ రెడ్డి, విజ్ఞాన్, సలీం, శ్రీనివాస చారి (ఇల్లందు), గుడిపూడి నరేష్, తావుడోజు సందీప్, తోటకూరి జయంత్ (టేకులపల్లి), సదానంద చారి, సద్గుణ చారి (ఆళ్లపల్లి) లను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం మాట్లాడుతూ జర్నలిస్టులు ఐక్యంగా ఉంటేనే వృత్తిపరమైన సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ యూనియన్ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో రాయితీలు, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి రమేష్, జిల్లా నాయకులు నాగ చందు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మార్క్ చూపించని మేయర్..!

- తొలి మేయర్‌పై భారీ అంచనాలు
- నాలుగు నెలలు దాటినా కనిపించని ప్రత్యేక ముద్ర
- అభివృద్ధిపై కనిపించని దృష్టి..
- ప్రజల్లో పెరుగుతున్న చర్చ..



కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 28, ప్రజాజ్యోతి కొత్తగూడెం మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో సీపీఐకి చెందిన కార్పొరేటర్ మూడ్ గణేష్ మేయర్‌గా ఎన్నికయ్యారు. అనేక రాజకీయ పరిణామాల మధ్య ఫిబ్రవరి 16న ఆయన ప్రమాణ స్వీకారం చేయడంతో కొత్త కార్పొరేషన్ అభివృద్ధికి కొత్త దిశ దొరుకుతుందనే ఆశలు ప్రజల్లో నెలకొన్నాయి. దీంతో తొలి మేయర్ పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తారని, అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తారని అందరూ భావించారు. అయితే అతను బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలకు పైగా గడిచినా ప్రజలకు స్పష్టంగా కనిపించే స్థాయిలో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో మేయర్ పనితీరుపై చర్చ మొదలైంది.

### ››› కనిపించని ప్రత్యేక కార్యాచరణ..

కార్పొరేషన్ హోదా రావడం అంటే కేవలం పేరు మారడం కాదు. పట్టణానికి మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక రహదారులు, సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, ట్రాఫిక్ నిర్వహణ, పట్టణ సుందరీకరణ వంటి అంశాల్లో గణనీయమైన మార్పు రావాలని ప్రజలు ఆశిస్తారు. అలాంటి సమయంలో తొలి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన నాయకుడిపై సహజంగానే ప్రజల అంచనాలు ఎక్కువగా ఉంటాయి. కానీ ఇప్పటివరకు కార్పొరేషన్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా కొత్త ప్రాజెక్టులు ప్రకటించడం, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికను ప్రజల ముందుంచడం, నగర రూపురేఖలు మార్చే నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాల్లో ఆశించిన చురుకుదనం కనిపించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో రహదారులు ఇప్పటికీ దెబ్బతిన్న స్థితిలోనే ఉన్నాయి. మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతుల పేరుతో తవ్విన రోడ్లు పూర్తిస్థాయిలో ఇంకా పునరుద్ధరణ కాకపోవడంతో వర్షాలు పడితే రహదారులే కాలువలను తలపిస్తున్నాయి. దీంతోపాటు నీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు, పారిశుద్ధ్య లోపాలు, వీధి దీపాల సమస్యలు కూడా పూర్తిగా పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు.

### ››› తొలి మేయర్‌గా చరిత్రలో నిలిచే అవకాశం...

కొత్త కార్పొరేషన్‌కు తొలి మేయర్‌గా చరిత్రలో నిలిచే అరుదైన అవకాశం మూడ్ గణేష్‌కు లభించింది. అలాంటి బాధ్యతలో ఉండే నాయకుడు కేవలం సమావేశాలకు, కాలయాపనకు పరిమితం కాకుండా పట్టణ అభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. డివిజన్ల వారీగా సమస్యలపై సమీక్షలు నిర్వహించడం, అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించడం, ప్రతి వార్డుకు అభివృద్ధి ప్రణాళిక రూపొందించడం అత్యవసరమని పలువురు సూచిస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వ నిధులు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టడం, ప్రజలకు కనిపించే ఫలితాలు సాధించడం వంటి అంశాల్లో మేయర్ చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని కొందరు విశ్లేషిస్తున్నారు. అయితే తొలి మేయర్‌గా చరిత్రలో పేరు నమోదు కావడం ఒక విషయం అయితే, అభివృద్ధి ద్వారా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవడం మరో విషయం. ఇప్పటికైనా కార్పొరేషన్ అభివృద్ధిపై మేయర్ పూర్తిస్థాయిలో దృష్టి సారించి, ప్రజలకు కనిపించే మార్పును తీసుకురావాలనే ఆకాంక్ష పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతోంది. లేకపోతే తొలి మేయర్‌గా చరిత్రలో పేరు నిలిచినా, అభివృద్ధి పరంగా ప్రత్యేక ముద్ర వేయలేకపోయారనే విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లోనూ వినిపిస్తోంది.

# ప్రజల కోసం ముందడుగు..

- హమాలీ కాలనీ రహదారిని మరమ్మతు చేయించిన ఆలపాటి ప్రసాద్



పాల్వంచ, జూన్ 28, ప్రజాజ్యోతి: భద్రాచలం రోడ్ నుంచి రెజీనా స్కూల్ పక్క నుండి హమాలీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి ఎన్నో సంవత్సరాలుగా అధ్వన్నంగా మారి గుంతలమయంగా ఉండటంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. ఇటీవల ఈ సమస్యను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి రహదారి నిర్మాణానికి హామీ ఇవ్వడంతో పాటు పనులకు ఆమోదం కూడా లభించింది. త్వరలోనే శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. అయితే పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఇదే రహదారిపై ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో హమాలీ కాలనీ ప్రజలు 5వ డివిజన్ ఇంచార్జ్ ఆలపాటి ప్రసాద్‌ను కలిసి తాత్కాలికంగా గుంతలను పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఇబ్బందిని తన ఇబ్బందిగా భావించిన ఆయన వెంటనే స్పందించి, తన సొంత ఖర్చులతో రహదారిపై ఉన్న గుంతలను పూడ్చించి రాకపోకలకు అనుకూలంగా మార్చారు. తక్షణమే స్పందించి ప్రజల సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్న ఆలపాటి ప్రసాద్‌కు హమాలీ కాలనీ ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆమోదం పొందిన రహదారి నిర్మాణ పనులు కూడా వీలైనంత త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని వారు కోరారు.

# ప్రమాదాలకు నిలువుటద్దంగా మారిన సితారామ పురం రహదారి

- ఆర్ అండ్ బి అధికారులు ఉన్నట్టా లేనట్టా?
- వరుణుడు రాకతో గుంతల రోడ్లలో నీరు, ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



అశ్వాపురం, జూన్ 28, ప్రజా జ్యోతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని సీతారాంపురం రహదారిపై విచ్చలవిడిగా గుంతలు ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఎన్నో మార్లు ఆర్ అండ్ బి అధికారులకు తెలియజేసిన పట్టించుకున్న దాఖలు లేవని సీతారామపురం ప్రజలు వాపోతున్నారు. వానకాలం కావడంతో ఎక్కడెక్కడో నీరు రోడ్లపైకి వచ్చి రహదారిపై ఉన్న గుంతలలో ఉండటంవల్ల ప్రయాణికులు రాత్రి సమయంలో గుంతలను గుర్తించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు వేసే ప్యాచ్ వర్క్ నాసి రకంగా ఉండడంతో వర్షాల వల్ల వేసిన చోటే మళ్లీ పెద్ద గోతులు పడుతున్నాయి. దీనివల్ల గోతులలో నీళ్ళు చేరి వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. అది కాకుండా ఈ రహదారిలో పెద్దపెద్ద వాహనాలు తిరుగుతూ ఉంటాయి. రహదారిలో గుంతలు ఉండటం వల్ల వాహనదారుల అదుపుతప్పి పెద్ద వాహనాల కిందకి పోయే అవకాశం ఉంది. కాబట్టి అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ సమస్యకు మార్గం చూపుతారని మండల ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. లేనియెడల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

# దొడ్డ సత్యవతి పెద్దకర్మకు హాజరైన సీపీఎం జిల్లా, రాష్ట్ర నాయకులు



**దమ్మపేట,జూన్ .28(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని నాయుడుపేట గ్రామంలో సీపీఎం పార్టీ మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ మాతృమూర్తి దొడ్డ సత్యవతి దశదిన పెద్దకర్మ కార్యక్రమం ఆదివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏ.జే. రమేష్, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కొక్కరపాటి పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు బి. చిరంజీవి నాయుడు, దమ్మపేట మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావుతో పాటు పార్టీ నాయకులు తుమ్మా రాంబాబు, ఆల్ నాగేశ్వరరావు, శ్రీరామచంద్రరావు, కృష్ణవేణి, మండల కమిటీ సభ్యులు కొలికిపోగు శ్రీనివాసరావు, నాలపోగు అనిల్ కుమార్, మండల పార్టీ ముఖ్య నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు.నాయకులు దొడ్డ సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని ఓదార్పు పలికారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, సీపీఎం కార్యకర్తలు, అభిమానులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని దొడ్డ సత్యవతికి ఘన నివాళులర్పించారు.

# 58వ డివిజన్‌లో పల్స్ పోలియో కార్యక్రమం



**కొత్తగూడెం టౌన్ , జూన్ 28 ( ప్రజాజ్యోతి )** 58వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ దావూద్ ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మొహమ్మద్ దావూద్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగమణి, ఆర్పీ శేషు కుమారి, నాగిల లలిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి



**ములకలపల్లి, జూన్ 28 (ప్రజాజ్యోతి):** మండలం మూకమామిడి గ్రామ పంచాయతీలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలియో రహిత సమాజం కోసం 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కురుసం సీత, సీహెచ్ఓ పూజ ప్రసన్న, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని గ్రామంలోని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

# స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్.ఐ.ఎస్ కోచ్‌గా గుర్తింపు పొందిన ఉప్పుశెట్టి రాకేష్



**కొత్తగూడెం కలెక్టరేట్/ పాల్వంచ, జూన్ 28, (ప్రజా జ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలానికి చెందిన ఉప్పు శెట్టి రాకేష్ గత మూడు సంవత్సరాలుగా బాస్కెట్ బాల్ కోచ్‌గా సేవలందిస్తూ బెంగళూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేతాజీ సుభాస్ సదరన్ సెంటర్లో డిసెంబర్ 2025 నుండి జనవరి 2026 వరకు నిర్వహించిన ఎన్.ఐ.ఎస్ (బాస్కెట్‌బాల్) కోర్సు ను విజయవంతంగా పూర్తి చేసి అధికారికంగా ఎన్.ఐ.ఎస్ సర్టిఫికేషన్ పొందారు. ఈ ప్రతిష్టాత్మక కోర్సు ద్వారా ఆధునిక కోచింగ్ విధానాలు, క్రీడా విజ్ఞానం, ఆటగాళ్ల నైపుణ్యాభివృద్ధి ,శారీరక దృఢత్వానికి సంబంధించిన అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొందారు. ప్రస్తుతం రాకేష్ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు, బాస్కెట్‌బాల్ క్రీడ అభివృద్ధికి యువ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడా రంగానికి చెందిన పలువురు ప్రముఖులు, సహచరులు 1 క్రీడాభిమానులు ఉప్పుశెట్టి రాకేష్‌ను అభినందించారు. ఆయన సాధించిన ఈ విజయానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకే గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్ది జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# జీవన నైపుణ్యాలే విజయానికి పునాది: ఎస్సై మధుప్రసాద్



**ములకలపల్లి, జూన్ 28 (ప్రజాజ్యోతి):** యువత, విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి జీవితంలో విజయాలు సాధించేందుకు జీవన నైపుణ్యాల విద్య ఎంతో అవసరమని ములకలపల్లి ఎస్సై మధుప్రసాద్ అన్నారు. గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కౌమార బాలికలకు నిర్వహించిన జీవన నైపుణ్యాల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరైన నిర్ణయాలు తీసుకోవడం, మానసిక ఒత్తిడిని అధిగమించడం, గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండడం, బాలికల రక్షణ, పోక్సో చట్టం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఏ సమస్య వచ్చినా అధైర్యపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిస్టర్స్ ఉదయ, రీమా, అరుణ, సుజాతతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ పోలియోతో చిన్నారులకు రక్షణ



**చర్ల, జూన్ 28 (ప్రజాజ్యోతి):** చర్ల మండలంలోని లింగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని లింగాపురం, లింగాపురంపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గుగులోతు మంగ, ఉప సర్పంచ్ తడకల నరేష్ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించడం ద్వారా పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలు సహకరించాలని ప్రతి ఇంటి నుంచి చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో బిఎల్ఏల పాత్ర కీలకం : ఎస్.కె. సాబీర్ పాషా



**కొత్తగూడెం టౌన్ , జూన్ 28 ( ప్రజాజ్యోతి )** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏలు) బాధ్యతాయుతంగా పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్లో నిర్వహించిన లక్ష్మీదేవిపల్లి మండల స్థాయి బిఎల్ఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు బిఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని బీఎల్వోలతో సమన్వయంగా సర్వేలో పాల్గొనాలని సూచించారు. బోగస్ ఓట్ల తొలగింపు, చనిపోయిన వారు మరియు వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, ఓటరు కార్డుల్లో తప్పుల సవరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ కమిటీలు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చంద్రగిరి శ్రీనివాసరావు, మూడ్ గణేష్, దీటి లక్ష్మీపతి, మామిడాల ధనలక్ష్మి, సపావట్ రవి, జర్పుల ఉపేందర్, కళ్లెం సత్యనారాయణ, హత్తిరమ్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో అక్రమ ఇసుక రవాణా పట్టివేత

- **25 టన్నుల ఇసుక, టిప్పర్ స్వాధీనం**

**దమ్మపేట, జూన్ 28 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వ అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని దమ్మపేట పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. 25 టన్నుల ఇసుకతో పాటు టిప్పర్ లారీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం ఉదయం ఎస్ఐ డి. బాలస్వామినాథం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మహీంద్రా టిప్పర్ (ఎపి 39డబ్లుయన్7999) అనుమానాస్పదంగా కనిపించింది. వాహనాన్ని తనిఖీ చేయగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన పిడిమల్ల శ్రీను టిప్పర్‌ను నడుపుతున్నట్లు గుర్తించారు.విచారణలో దమ్మపేటకు చెందిన కొలేటి వినోద్, కొలేటి ఆదినారాయణ, మండలపల్లికి చెందిన నీలం సాయి కుమార్, కరిబెండి రాజు ఆదేశాల మేరకు, నీలం సాయి కుమార్‌కు చెందిన టిప్పర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాళ్లపూడి మండలంలోని చిడిప్ప ఇసుక ర్యాంపు నుంచి తెలంగాణ ప్రభుత్వ పర్మిట్ లేదా ఈ–ట్రాన్సిట్ పాస్ లేకుండా ఇసుకను తెలంగాణ ప్రాంతానికి తరలిస్తున్నట్లు తేలింది. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, సుమారు రూ.25 వేల విలువైన 25 టన్నుల ఇసుకతో పాటు టిప్పర్ లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి: సర్పంచ్ కుంజా వినోద్



**ములకలపల్లి, జూన్ 28 (ప్రజాజ్యోతి):** జగన్నాథపురం గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 0–5 సంవత్సరాల లోపు చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి, తల్లిదండ్రులకు కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచ్ కుంజా వినోద్ మాట్లాడుతూ, "పోలియో రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్క చిన్నారికి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూట్ సూపర్వైజర్ హనుమంతరావు, ములకలపల్లి మండల బీఎల్ఏ కోఆర్డినేటర్ సురభి రాజేష్, బీఎల్ఏలు షేక్ జబ్బర్, గుంటూరు సాయి, రామాచారి, షేక్ జానీ, గ్రామ పెద్దలు సోయం బోడప్ప, కూరం రామకృష్ణ, పిడియాల వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు రాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## 18వ వార్డు అధ్యక్షులు గా పల్లెర్ల చంద్రశేఖర్





**ఇల్లందు, జూన్ 28 (ప్రజా జ్యోతి)** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు కాంగ్రెస్ పార్టీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆదివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య గారి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భోళ్ల సూర్యం, మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కలిసి వార్డు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పల్లెర్ల చంద్రశేఖర్, కార్యదర్శిగా ఒంగూరి శ్రీనివాస్, కోశాధికారి గా గౌరీశెట్టి నగేష్ ( సెల్ పాయింట్ ) ను ఎన్నుకున్నారు. వార్డు స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ 18వ వార్డు కమిటీకి పందిళ్ల వెంకన్న, చందా చంద్రశేఖర్, సంక సత్య నాగేంద్ర శ్యామ్, మేకల మల్లేష్, యెలుగూరి నగేష్, తెలి బాలాజీ, గోనెల రాజశేఖర్ లు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 28,(ప్రజా జ్యోతి)** సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు, కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జి ల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## పల్స్ పోలియో కార్యక్రమం



**చర్ల, జూన్ 28 (ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలోని ఉప్పరిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఉప్పరిగూడెం, గన్నవరం కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సోయం నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "నేటి బాలలే రేపటి పౌరులు" అని దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టాలంటే ప్రతి చిన్నారికి ఐదేళ్ల వయస్సు పూర్తయ్యేలోపు తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని అన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామంలోని చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విరిగిన చెట్లను వెంటనే తొలగించాలి

- పాల్వంచ 8వ డివిజన్ యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో విరిగిపడ్డ చెట్లు
- ప్రమాదకరంగా మారిన ప్రాంగణం







**పాల్వంచ, జూన్ 28, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని 8వ డివిజన్ యూపీఎస్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వారం రోజుల క్రితం కురిసిన గాలివానకు పెద్ద పెద్ద చెట్లు విరిగి పడిపోయినా, ఇప్పటికీ వాటిని తొలగించకపోవడంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు వస్తున్నప్పటికీ, విరిగిన చెట్లు, పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం యథాతథంగా ఉండటంతో పాఠశాల ప్రాంగణం ప్రమాదకరంగా మారింది. దీంతో పాములు, విషపురుగులు సంచరించే అవకాశం ఉండటంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరిగినా బాధ్యత ఎవరిదనే ప్రశ్న తలెత్తుతోంది.స్థానిక కార్పొరేటర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి విరిగిన చెట్లను తొలగించి, పాఠశాల పరిసరాలను పూర్తిగా శుభ్రపరచాలని స్థానిక శ్రీనివాస్ నగర్ కాలనీ ప్రజలు కోరుతున్నారు. అలాగే దోమల నివారణ కోసం ఫాగింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారుల బాధ్యత అని వారు పేర్కొన్నారు.

## ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం

- సత్యనారాయణపురం పీహెచ్‌సీల్లో 98 శాతం కవరేజ్



**చర్ల, జూన్ 28(ప్రజాజ్యోతి ):** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా చర్ల, సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చర్ల పిహెచ్సి కొయ్యూరు వైద్యాధికారి డాక్టర్ హారిక, సత్యనారాయణపురం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ దివ్య నయన ఆధ్వర్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మురళి , చర్ల గ్రామ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, సత్యనారాయణపురం గ్రామ సర్పంచ్ గౌతమి, మండల తహసీల్దార్లు శ్రీనివాసరావు హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తొలి రోజే 98 శాతం కవరేజ్ నమోదైనట్లు వైద్యాధికారి డాక్టర్ హారిక తెలిపారు. మిగిలిన చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేసి వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు.అదేవిధంగా సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 13 గ్రామ పంచాయతీల్లో కూడా తొలి రోజే 98 శాతం కవరేజ్ నమోదైనట్లు వైద్యాధికారి డాక్టర్ దివ్య నయన తెలిపారు. మిగిలిన చిన్నారులకు ప్రత్యేక బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమాల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## పీవీ సేవలు చిరస్మరణీయం

- ఘనంగా పీవీ నరసింహారావు జయంతి వేడుక



**చర్ల, జూన్ 28 :(ప్రజాజ్యోతి ):** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి పాములపర్తి వెంకట నరసింహారావు జయంతిని పురస్కరించుకుని చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని ఆర్థిక సంస్కరణల దిశగా నడిపించి భారత అభివృద్ధికి నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిన మహోన్నత నాయకుడు పీవీ నరసింహారావు అని కొనియాడారు. సంక్లిష్ట పరిస్థితుల్లో దేశానికి సమర్థవంతమైన నాయకత్వం అందించి భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ స్థాయిలో నిలబెట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.బహుభాషా పండితుడు, మేధావి, సాహితీవేత్త, దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిగా పీవీ నరసింహారావు భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలు, విలువలు, పరిపాలనా దక్షత నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోసీనియర్ నాయకులు గుండెపూడి భాస్కర్‌రావు, పోలిన లంక రాజు, సత్తిబాబు, వాసు, రాయుడు, గోగాల సంధ్య, కనితి శిరీష, కాక శ్రీవిద్య, మచ్చ వరలక్ష్మి, యాడిల సుజాత, శివ సంపత్, హర్షరెడ్డి, బాట బాలకృష్ణ, రాకేష్, బాబీ, సాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట పీహెచ్ సీ పరిధిలో 95 శాతం పల్స్ పోలియో పూర్తి


- 3,146 మంది లక్ష్య చిన్నారులకు గాను 2,971 మందికి పోలియో చుక్కలు



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 28 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. రెండు రూట్లుగా విభజించి 24 పోలియో బూత్ ల ద్వారా మొత్తం 3,146 మంది లక్ష్య చిన్నారులకు గాను 2,971 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడంతో 95 శాతం లక్ష్యం పూర్తయింది.ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ సైదులు ప్రత్యేక అధికారిగా పర్యవేక్షించారు. పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను సోమవారం గృహ దర్శనాల ద్వారా గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్య అధికారులు తెలిపారు.కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మనోజ్, సీహెచ్ వో వాణి, పీహెచ్ ఎన్ ఎస్తేర్ రాణి, హెచ్ ఈ జయలక్ష్మి, హెచ్ ఎస్ ప్రకాశ్ రావు, హెచ్ ఏ రామదాసు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విధుల్లో భారం..?

- విద్యార్థులకు పాఠాలు చెప్పాలా..? జనాభా లెక్కలు చేయాలా..?
- అధిక విధులతో అయోమయంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు
- విద్యేతర బాధ్యతలతో తగ్గుతున్న బోధన సమయం
- ఖాళీ పోస్టుల కారణంగా ఉపాధ్యాయులపై రెట్టింపు పని భారం
- ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు విద్యాసంస్థల వైపు విద్యార్థుల మొగ్గు
- అధిక ఫీజులతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం – పేదలకు చదువు భారంగా మారుతున్న పరిస్థితి
- విద్యా నాణ్యత కోసం బోధనేతర విధుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలని సంఘాల విజ్ఞప్తి



**టేకులపల్లి, జూన్ 28,(ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులపై రోజురోజుకూ పెరుగుతున్న విద్యేతర విధులు విద్యా బోధనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యార్థులకు పాఠాలు బోధించడమే ప్రధాన బాధ్యత అయిన ఉపాధ్యాయులు ప్రస్తుతం జనాభా లెక్కలు, ఎన్నికల విధులు, ఓటరు జాబితా సవరణ, వివిధ ప్రభుత్వ సర్వేలు, యాప్‌లలో సమాచారం నమోదు, పరిపాలనా కార్యక్రమాలు వంటి అనేక బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోంది. ఫలితంగా తరగతి గదిలో విద్యార్థులకు కేటాయించాల్సిన విలువైన సమయం తగ్గిపోతుండగా, విద్యా నాణ్యతపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### ››› బోధనకు తగ్గుతున్న సమయం

విద్యార్థుల అభ్యాస స్థాయిని మెరుగుపరచడం, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించడం వంటి అంశాలపై ఉపాధ్యాయులు దృష్టి సారించాల్సిన సమయంలో విద్యేతర పనులు అడ్డంకిగా మారుతున్నాయి. తరచూ జరిగే సర్వేలు, సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ఆన్‌లైన్ డేటా నమోదు వంటి పనుల వల్ల బోధనకు అంతరాయం ఏర్పడుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

### ››› ఖాళీ పోస్టులతో పెరుగుతున్న భారం

పాఠశాలల్లో కార్యాలయ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్లు తదితర సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. పలు కేటగిరీల్లో పోస్టులు ఖాళీగా ఉండటంతో పరిపాలనా బాధ్యతలు కూడా ఉపాధ్యాయులే నిర్వహించాల్సి వస్తోంది. దీంతో ఒకే ఉపాధ్యాయుడు బోధనతో పాటు కార్యాలయ పనులు కూడా చేయాల్సిన పరిస్థితి ఏర్పడి, విద్యార్థులపై చూపాల్సిన శ్రద్ధ తగ్గుతోందని ఆవేదన వ్యక్తమవుతోంది.

### ››› ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు సమయం తగ్గుతోందనే భావనతో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందాలని ఆశించిన ప్పటికీ, పరిస్థితుల కారణంగా ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు.

### ››› తల్లిదండ్రులకు మోయలేని ఆర్థిక భారం

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫారాలు, రవాణా, ఇతర ఖర్చులు కలిపి కుటుంబాలపై భారీ ఆర్థిక భారం పడుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, పేద కుటుంబాల పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### ››› విద్యకు దూరమవుతున్న పేదలు

ప్రైవేటు విద్య ఖర్చులను భరించలేని పేద కుటుంబాల్లో కొందరు పిల్లలు చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విద్యా అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### ››› ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ఉపాధ్యాయులను ప్రధానంగా బోధనకే పరిమితం చేసి, జనాభా లెక్కలు, సర్వేలు, ఇతర పరిపాలనా పనులకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసి, అవసరమైన సహాయక సిబ్బందిని నియమిస్తే ఉపాధ్యాయులపై భారం తగ్గడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశం మెరుగుపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.



## మహిళల హక్కుల కోసం ఉద్యమించాలి

- పి.ఓ.డబ్ల్యు జిల్లా నాయకురాలు ఇంటిక లక్ష్మి



**ములకలపల్లి, జూన్ 28 (ప్రజాజ్యోతి):** మహిళల హక్కుల సాధన కోసం, వారిపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులకు వ్యతిరేకంగా ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా నాయకురాలు ఇంటిక లక్ష్మి అన్నారు. మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ఈసం పార్వతి అధ్యక్షతన ప్రగతిశీల మహిళా సంఘం జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఇంటిక లక్ష్మి పాల్గొని మాట్లాడారు. దేశంలో మహిళలు ఇప్పటికీ పితృస్వామ్య సమాజంలో వివక్షను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. దేశంలో మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులను ప్రజలందరూ తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కుల పరిరక్షణ కోసం ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో చేపట్టే పోరాటాల్లో మహిళలందరూ పెద్ద ఎత్తున పాల్గొని సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం 15 మంది సభ్యులతో కూడిన ప్రగతిశీల మహిళా సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఈసం పార్వతి, ఉపాధ్యక్షురాలిగా ఊకే వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా అడప పద్మ, సహాయ కార్యదర్శిగా మడకం లలిత, కోశాధికారిగా మడివి నాగలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కుంజా కృష్ణ, ఈసం వెంకన్న, చంటిబాబు, మడకం భద్రయ్య, మడివి సీతారాములు, సంఘం నాయకురాళ్లు, సభ్యులు మిడియం కమల, మడివి రుక్మిణి, బొగ్గం చిలకమ్మ, మడకం రామలక్ష్మి, ఈసం ముత్తమ్మ, మడివి లక్ష్మి, ఈసం రాములమ్మ, నందిని తదితరులు పాల్గొన్నారు.

## మాధారంలో మురుగు నీటి నిల్వలు తొలగించాలి

- శానిటేషన్ పనులు వెంటనే ప్రారంభించాలి
- తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్



**ములకలపల్లి, జూన్ 28 (ప్రజాజ్యోతి):** మండలంలోని మాదారం గ్రామపంచాయతీలో వీధుల్లో వాడుక నీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని వీధి రోడ్లపై వాడుక నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజలు విషజ్వరాలు, ఇతర అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామంలో మురుగునీటి నిల్వలను తొలగించి, శానిటేషన్ పనులను తక్షణమే ప్రారంభించాలని కోరారు. అలాగే వీధి లైట్లు లేని ప్రాంతాల్లో వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని, గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులను కోరారు. గ్రామపంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చనగాని వినోద్, పసుల సూర్య, నాగబాబు, ముదిగొండ వెంకన్న, కురం ప్రభాకర్, గణప భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 98 శాతం మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు




**ములకలపల్లి, జూన్ 28 (ప్రజాజ్యోతి):** మండలంలోని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మండలవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 35 పోలియో బూత్‌లలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మొత్తం 2,385 మంది చిన్నారులను లక్ష్యంగా పెట్టుకోగా, తొలి రోజే 2,348 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడంతో 98 శాతం లక్ష్యం సాధించినట్లు వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాణ్ తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ పోలియో బూత్‌ను స్థానిక సర్పంచ్ చంద్రలేఖ ప్రారంభించారు. మిగిలిన 2 శాతం మంది చిన్నారులకు సోమవారం, మంగళవారం నిర్వహించే ఇంటింటి సర్వే ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని 13 గుత్తికోయ హై రిస్క్ గ్రామాల్లో ఎనిమిది గ్రామాల్లో తొలి రోజే కార్యక్రమం పూర్తిచేయగా, మిగిలిన గ్రామాల్లో రానున్న రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు.

## ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలు, ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు



**ఆళ్ళపల్లి, జూన్28, (ప్రజా జ్యోతి)** గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న (సీఆర్టీలు) ఏఎన్ఎంలను తక్షణమే రెగ్యులర్ విధుల్లోకి తీసుకోవాలని టిపిటిఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,102 మంది సీఆర్టీలు, భద్రాచలం ఐటిడిఏ పరిధిలో 202 మంది సీఆర్టీలు, 80 మంది ఏఎన్ఎంలు గత 20 ఏళ్లుగా అంకితభావంతో సేవలందిస్తున్నారని తెలిపారు. వారి సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. దీంతో ఆశ్రమ పాఠశాలల్లో విద్య, ఆరోగ్య సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.